క్లుప్తంగా

పౌష్టికాహారం కిట్ల పంపిణీ

కపిలేశ్వరపురం: అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలో ఎయిడ్స్ బారినపడినవారికి పీహెచ్‌సీ ఏఎన్ఎం వై.స్వర్ణలత పౌష్టికాహారం కిట్లు అందజేశారు. వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య చేతుల మీదుగా మంగళవారం వాటిని పంపిణీ చేశారు. పౌష్టికాహారాన్ని తీసుకొంటూ, మనోధైర్యంతో కూడిన జీవన శైలికి అలవాటు పడటం ద్వారా పూర్తికాలం జీవన ప్రమాణాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ సీహెచ్ గోపాలకృష్ణ, హెల్త్ విజిటర్ వీవీరమణ, ఆరోగ్య సహాయకులు రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పి స్వప్న, ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వానంగా నరజాడ రహదారి



అధ్వానంగా మారిన నరజాడ-అముజూరు రహదారి

కె.గంగవరం: మండలంలోని అముజూరు-నరజాడ రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారి నిర్మించి సుమారు ఆరేళ్లు అవుతుంది. పక్కనే పంట కాలువ ఉండడం వల్ల రోడ్డు కోతకు గురైంది. మరోవైపు సుమారు 4 కిలోమీటర్లు ఉండే ఈ రహదారిలో ఎక్కడపడితే అక్కడ గుంతలు పడి మరీ అధ్వానంగా మరింది. కూళ్లమల్లవరం, నరజాడ గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారినే నియోగిస్తుంటారు. ఈ రహదారి సరిలేకపోవడంతో రోజు ఈ గ్రామం నుంచి వాకతిప్పవెళ్లే బస్సు కూడా రావడం లేదని దీంతో నానాఅవస్థలు పడుతున్నామని ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రామచంద్రపురం తహసీల్దార్‌గా సావిత్రి



రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల తహసీల్దార్‌గా ఎం.సావిత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆమె రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓగా బాధ్యతలు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు రామచంద్రపురం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన డీటీ వరసాల మాధురి నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

కాజులూరు: త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నిక నిర్వహణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో శలపాక, గొల్లపాలెం, పెనుమళ్ళ, కాజులూరు, మంజేరు, కోలంక, పల్లిపాలెం సంఘాలకు ఈ నెల ఎనిమిదో తేదీ ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ఇందుకు సంబంధించి ఐదో తేదీన నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారు చేసి గ్రామ సచివాలయాల్లో ఉంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంబాబు, ఆర్ఐ వేగేశ్వరరావు, ఏఓ వి.అశోక్, వీఆర్వోలు ఈశ్వరరావు, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి అంగరలో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి



అంగరలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారు

కపిలేశ్వరపురం: అంగరలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలను ఈ నెల 6 నుంచి 11 వరకూ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు ఆరాధ్య దైవంగా భావించే స్వామి కల్యాణ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కొమాళ్ళపల్లి సత్యనారాయణమూర్తి, సుబ్రహ్మణ్యం, వెంకట్రావు అర్చక పర్యవేక్షణలో పూజలకు సన్నద్ధమయ్యారు. 6న సంకల్పం, గ్రామోత్సవంతో పాటు కల్యాణం నిర్వహించనున్నారు. 7న ఆలయం వద్ద తీర్థం, 10న స్వామి కంకణసేవ, 11న శ్రీపుష్పోత్సవం పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.రాంబాబురెడ్డి తెలిపారు.

భవితకు భరోసా

- దివ్యాంగుల సేవలో భవిత కేంద్రాలు
- ట్యాబ్‌ల అందజేత
- 18 యాప్‌ల ద్వారా శిక్షణ
- ఈ నెల 9 వరకు దివ్యాంగుల వారోత్సవాలు

రాయవరం: విభిన్న ప్రతిభావంతుల చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి కలలను సాకారం చేసేందుకు భవిత కేంద్రాలు ఉపకరిస్తున్నాయి. శారీరక వైకల్యంతో బాధపడుతూ సహచర చిన్నారులతో సమానంగా చదువుకోలేని వారి బంగారు భవిష్యత్తుకు ఈ కేంద్రాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. సమగ్ర శిక్షలోని సహిత విద్య విభాగం ద్వారా వారికి అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేసి ఆదరిస్తోంది. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9 వరకూ దివ్యాంగుల వారోత్సలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్లస్టర్ పరిధిలో భవిత కేంద్రాల ద్వారా విభిన్న ప్రతిభావంతులకు అందుతున్న సౌకర్యాలపై కథనం.

వైఎస్సార్ సీపీ హయాంలో వెలుగులు

భవిత కేంద్రాల నిర్వహణ గతంలో చాలా అధ్వానంగా ఉండేది. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ కేంద్రాలు దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపాయి. గత ప్రభుత్వ హయాంలో అన్ని రకాల వసతులతో భవిత కేంద్రాలు విరాజిల్లాయి. మండపేట, రామచంద్రపురం క్లస్టర్ పరిధిలోని మండపేట, రామచంద్రపురం, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో భవిత కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో 105 మంది ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు సేవలు పొందుతున్నారు. భవిత కేంద్రాలకు కాకుండా వివిధ పాఠశాలలకు వెళ్లే చిన్నారులు 726 26 మంది ఉన్నారు. వీరికి మానసిక, శారీరక ఎదుగుదల తీసుకురావాలనే సంకల్పంతో పలు రకాల పథకాలు అమలు చేస్తున్నారు. ఎంఆర్ కిట్లు, అత్యాధునిక హియరింగ్ మెషీన్లు, ట్రై సైకిళ్లు, మధ్యాహ్న భోజనంతో పాటు బస్‌పాస్‌లు, వారానికి ఒక రోజు ఫిజియోథెరపీ, నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి దగ్గరే విద్య, వైద్య సేవలు, ప్రతి నెల స్టైఫండ్, హెచ్‌బీసీ, ట్రాన్స్‌పోర్టు, ఎస్కార్ట్ అలవెన్సులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ప్లేస్కూల్ తరహాలో

చదువుతో పాటు ఆటలు, పాటల్లో ప్లే స్కూల్ తరహాలో అన్ని రకాలుగా దివ్యాంగ చిన్నారులు అభివృద్ధి చెందేలా శిక్షణ ఇస్తున్నారు. స్పెషల్ బీఈడీ చేసిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ చిన్నారులు ఆటపాటలతో కూడిన విద్య అభ్యసిస్తున్నారు. వినికిడి లోపం ఉన్న వాళ్లకు వీడియో చూపించి అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. ఇలా ప్రతి అంశంలోనూ ఉపాధ్యాయులు చక్కటి శిక్షణ ఇచ్చి లోపాలు మర్చిపోయేలా చేస్తున్నారు.

ఫిజియోథెరపీ

ప్రతి వారం ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. శారీరక వైకల్యం, పక్షవాతం, గ్రహణంమొర్రి, గ్రహణశూల వంటి వాటితో బాధపడుతున్న వారికి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు.

ట్యాబ్‌లు అందజేత

దృష్టి, వినికిడి లోపం ఉన్న వారు సైతం సాధారణ విద్యార్థుల్లా ఉన్నత విద్య చదవాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధునిక సాంకేతికతతో కూడిన ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఐఈఆర్‌పీలకు, ఐఈడీఎస్ఎస్‌లకు, దృష్టిలోపం ఉన్న వారికి, వినికిడి లోపం ఉన్న వారికి ఇలా మొత్తంగా 72 ట్యాబ్‌లను అందజేసింది. ట్యాబ్‌లను ఎలా వినియోగించాలన్న అంశంపై ఉపాధ్యాయులు, చిన్నారులకు శిక్షణ ఇచ్చారు.

వెలుగులు నింపేలా సమాచారం

గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ట్యాబ్‌ల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న దృష్టి, వినికిడి లోపం కలిగిన విద్యార్థులకు అనుగుణంగా అత్యంత అధునాతన సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. వీటిలో గూగుల్ ట్రాన్స్‌క్రైబ్, గూగుల్ లుక్ అవుట్, డాక్స్, బీ మై ఐ, ఎస్ విజన్ ఆల్, నీట్, జీ బోర్డు, నోట్ ప్యాడ్, గూగుల్ కీ తదితర ప్రత్యేకతలు పొందుపరిచారు. అందులు, బధిరులకు వీలుగా ట్యాబ్‌ను ఏ వైపు ఉపయోగించినా స్పందించేలా, శబ్ద సాంకేతికతల ద్వారా వినియోగించేలా, దృష్టి లోపం ఉన్న వారికి చిన్న చిన్న విషయాలను స్పష్టంగా చూపడానికి, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తదితరాలతో ప్రత్యేకంగా రూపొందించిన 18 యాప్‌లను ట్యాబ్‌ల్లో పొందుపరిచారు.

తన పనులు తాను చేసుకుంటాడు



మా బాబు పేరు జీవన్ కుమార్.కొన్నేళ్లుగా బుద్ధిమాంద్యం, శారీరక వైకల్యంతో బాధపడుతున్నాడు. సరిగా కూర్చునే వాడు కాదు. భవిత కేంద్రంలో చేర్చిన తర్వాత ఫిజియోథెరపీ సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం చిన్న చిన్న పనులను చేసుకోగలుగుతున్నాడు. బాబుకు వీల్ చైర్ వచ్చింది.

– కొమరపు సుబ్బులక్ష్మి, తామరపల్లి, కె.గంగవరం మండలం

డిజిటల్ విద్యకు ప్రాధాన్యం



ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు కూడా డిజిటల్ విద్య అందుబాటులోకి వచ్చింది. ఇందులో భాగంగానే గత విద్యా సంవత్సరంలో ఐఈఆర్‌పీలతో పాటుగా చిన్నారులకు ట్యాబ్‌లను అందజేశారు. ట్యాబ్‌ల నిర్వహణపై శిక్షణ కూడా అందజేశారు.

– ఎస్.అనూరాధ, ఐఈఆర్‌పీ, మండపేట



చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఐఈఆర్పీ

క్లస్టర్ పరిధిలోని భవిత కేంద్రాలు	06
కేంద్రాల పరిధిలోని విద్యార్థులు	38
ఐఈఆర్‌పీలు	12
ఐఈడీఎస్ఎస్‌లు	06
ఫిజియోథెరపిస్టులు	02
ఆయాలు	06
అలవెన్సు పొందే వారి సంఖ్య	379
ఎస్కార్ట్	128
రవాణా	142
స్టైఫండ్	320
హెచ్‌బీఏ	60



శారీరక వైకల్యం ఉన్నవారికి అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలు

కరుణించిన వరుణుడు



సుందరపల్లి రహదారిపై కప్పి ఉంచిన ధాన్యం రాశులను ఆరబెడుతున్న రైతులు

కె.గంగవరం: గత మూడు రోజులుగా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు మంగళవారం తెరిపినివ్వడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. రోడ్లపై, పంట పొలాల్లో, ఖాళీ స్థలాల్లో కప్పి ఉంచిన ధాన్యం రాశులను విప్పి రోడ్లపై ఆరబెడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మిగిలిన ధాన్యాన్ని ఆరుదల శాతం కోసం ఆరబెట్టారు. పామర్రు, భట్లపాలిక, కూళ్ల గ్రామాల్లో వ్యవసాయశాఖాధికారి బలుసు రవి పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కొన్ని చోట్ల దగ్గరుండి తడిచిపోయిన ధాన్యాన్ని రైతుల సహకారంతో మిల్లులకు పంపించారు. మండలంలో ప్రధాన కాలువలు టేకి డ్రెయిన్, రాజు కాలువలు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాల్లో నిలిచిపోయిన నీటిని పంట కాలువల్లోకి మళ్లించేందుకు రైతులు ప్రయాసపడ్డారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎంపీపీల ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా భవాని



పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం అనంతరం శ్రీకాంత్‌రెడ్డితో ఎంపీపీ భవాని

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ సీపీ ఎంపీపీల రాష్ట్ర స్థాయి కమిటీలో రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎంపికైనట్లు ఆమె మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ ఎంపీపీల సమావేశంలో ఎం.గాంధీ అధ్యక్షతన ఈ కమిటీని పార్టీ నాయకత్వం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. పార్టీకి తద్వారా ప్రజలకు సేవలందించడానికి తనకు అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్ వెన్నపూస రవీంద్రరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా 'కడలి'

రాయవరం: యూటీఎఫ్ రాయవరం మండల శాఖ అధ్యక్షుడిగా కడలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గొడితి మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా ఈ నియామకం జరిగినట్లు వారు మంగళవారం విలేకరులకు తెలిపారు.కార్యదర్శులుగా విల్లూరి వీరభద్రరావు, దొంతంశెట్టి సతీష్, నల్లమిల్లి భాస్కరరెడ్డి, శ్రీనివాసరావు, గుంటూరి అప్పారావు, గాయత్రీదేవి, కస్నూరి అర్జునుడు, సుబ్బారెడ్డి, సత్యవేణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సీపీఎస్ కన్వీనర్‌గా చిక్కాల శ్రీను ఎన్నికయ్యారు. మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, సభ్యులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమని శ్రీనివాస్, మురళీకృష్ణలు విలేకరులకు తెలిపారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం అందించాలి

నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ కమిటీ ప్రతినిధి సెల్వకుమార్



నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ కమిటీ ప్రతినిధులతో ద్వారపూడి పీహెచ్‌సీ సిబ్బంది

మండపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ సెల్వకుమార్, డాక్టర్ జయలక్ష్మి అన్నారు. తమిళనాడు నుంచి విచ్చేసిన స్టాండర్డ్స్ కమిటీ ప్రతినిధులు మంగళవారం ద్వారపూడి పీహెచ్‌సీని సందర్శించారు. ఆసుపత్రిలోని విభాగాలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఫార్మసీ, ల్యాబొరేటరీ, అవుట్, ఇన్ పేషెంట్, లేబర్‌రూమ్ విభాగాలను పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. మందులు, ల్యాబ్‌లోని పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో ప్రజలకు అందే సేవలు క్వాలిటీగా ఉండాలని సూచించారు. 24 గంటలూ ప్రసూతి సేవలు అందించాలని, సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా ప్రోత్సహించాలన్నారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలను వారు పర్యవేక్షించి సూచనలు చేశారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. హాస్పిటల్ అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు పి.జగదీప్, ఎం.అనూష, జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్ సునీత, రామచంద్రపురం డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, పీహెచ్‌సీ హెచ్‌వో రత్నకుమారి, సూపర్‌వైజర్ టి.మోహన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు పరంజ్యోతి



పరంజ్యోతికి నివాళులు అర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

ఐఫ్‌టీయూ ఆధ్వర్యంలో ద్వారపూడిలో నివాళి

మండపేట: ఆదర్శ కమ్యూనిస్టు పరంజ్యోతి ఆశయ సాధనకు పోరాటాలు ముమ్మరం చేద్దామని ఐఫ్‌టీయూ నాయకులు పిలుపు నిచ్చారు. పరంజ్యోతి 19వ వర్ధంతిని ద్వారపూడిలో మంగళవారం నిర్వహించారు. ద్వారపూడి వస్త్ర మార్కెట్ వద్ద గల పార్సిల్ అండ్ క్లాత్ మార్కెట్ కార్మిక సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘ నాయకుడు దేపాటి సత్యనారాయణ అధ్యక్షతన గుర్రాల పరంజ్యోతి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కాసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు, జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆర్.రాఘవులు మాట్లాడుతూ పరంజ్యోతి పీడిత ప్రజల పక్షాన నిలబడి అలుపెరగని పోరాటాలు సాగించారన్నారు. కార్మికుల కూలీరేట్ల కోసం, భూ పంపిణీ కోసం, దళితులపై దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన బాటలో పోరాటాలను ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్సిల్ అండ్ క్లాత్ మార్కెట్ యూనియన్ సభ్యులు మరుకుర్తి శ్రీను, కాసా పోతురాజు, మందాల గోవిందు, నీలపాల సుబ్రహ్మణ్యం, కొయ్య అప్పారావు, రామకృష్ణ, బి. గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు



కాకినాడ, కోటిపల్లి రహదారిపై నాకాబందీ నిర్వహించి వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

కాజులూరు: మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్‌కు అన్నారు. మంగళవారం గ్రామంలోని కాకినాడ, కోటిపల్లి రహదారిపై ఎస్సై మోహన్‌కుమార్ స్టేషన్ సిబ్బంది నాకాబందీ నిర్వహించి రికార్డులు సక్రమంగా లేని వారిపైనా, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపైనా కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. ఆయన ప్రయాణికులతో మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపడం వలన వారికే కాకుండా రోడ్డుపై వెళ్లే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రయాణికులు రోడ్డుపై వెళ్లే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

మండపేటలో కోర్టు ఏర్పాటు చేయాలి

మండపేట: నియోజకవర్గంలో సివిల్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ నియోజకవర్గంలోని న్యాయవాదులు మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. స్థానికంగా న్యాయస్థానం లేకపోవడంతో రామచంద్రపురం, అనపర్తి, ఆలమూరు కోర్టులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. నియోజవర్గ ప్రజలు న్యాయ సలహాలు, న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి అవస్థలు పడుతున్నారన్నారు. న్యాయవాదుల విన్నపాన్ని పరిశీలిస్తానని ఎమ్మెల్యే వేగుళ్ళ హామీ ఇచ్చారు.ఎమ్మెల్యేను కలసిన న్యాయవాదుల్లో కేవీవీ సాయిరామ్, ధూళి జయరాజు, పెనుమర్తి వెంకట్రావు, ఆకివేటి జోగానందం, గనేడ రాజశేఖర్, సీహెచ్ సతీష్, రమ్యశ్రీ, ఏబీ సంజు, ఎస్.వెంకటేష్, ఫయాజ్ ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురులంకలో ఇసుక అక్రమ రవాణాను మంగళవారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. గత కొంత కాలంగా ఈ ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగడంపై గ్రామస్తులు ఆగ్రహించారు. తమ అవసరాలకు ఇసుక లేదని చెప్పి అక్రమంగా ఇసుక ఎలా తరలిస్తారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకో నిబంధన మీకో నిబంధన అంటూ వారు ఇసుక అక్రమార్కులపై మండిపడ్డారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి ఇసుకలోడుతో సహా అడ్డుకుని అయినవిల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై పి.శ్రీనివాసరావు సిబ్బందితో చేరుకుని ఇసుక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలకు తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తామన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలి



కాజులూరులో భవిత చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న మండల తహసీల్దార్, ఎంఈఓ



ద్రాక్షారామలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్న సంఘ నాయకులు



మండపేటలో ట్రై సైకిల్స్ పంపిణీ చేస్తున్న నాయకులు



మండపేట పట్టణ భవిత కేంద్రంలో చిన్నారితో ఎంపీడీఓ తదితరులు

కాజులూరు: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. కాజులూరు భవిత సెంటర్‌లో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఈఓ పి.జాన్ అధ్యక్షతన జరిగిన సభలో మండల తహసీల్దార్ శివకుమార్ మాట్లాడుతూ దివ్యాంగులపై చిన్నచూపు భావన కాకుండా వారిలోని ప్రతిభా పాటవాలను ప్రోత్సహిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలన్నారు. గత వారం రోజులుగా జరుగుతున్న పలు ఆటల పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవికుమార్, చింతా నారాయణమూర్తి వినికిడి లోపంతో మూగబోయిన చిన్నారులకు మాటలు నేర్పటానికి స్పీచ్ థెరపీ మెషీన్‌ను భవిత సెంటర్ ఇన్చార్జ్ జయప్రకాష్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పల్లిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మీరాసాహెబ్, ఎంపీటీసీ బాపూజీ, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో యువశక్తి వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా యానాం సెంటర్‌లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దివ్యాంగుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకుడు చిక్కాల దొరబాబు సుమారు 100 మంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పులపల్లి ప్రసాద్, ముచ్చుమిల్లి లోవరాజు, ఇళ్ల ప్రసాదరావు, చందన శ్రీనివాస్, బుంగ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో..

మండపేట: వికలాంగుల దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ధర్మగుండం చెరువు వెనక కాలనీలోని దివ్యాంగుల భవనంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాశ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూలి జయరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దూలి జయరాజు మాట్లాడుతూ మున్సిపల్ బడ్జెట్లో మూడు శాతం నిధులను కేటాయించి దివ్యాంగులకు మాజీ చైర్మన్ చుండ్రు ప్రకాష్ అండగా నిలిచారని కొనియాడారు. ఈ భవనాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు 40 సెంట్ల స్థలాన్ని కేటాయించి రూ.50 లక్షలతో కొత్త భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత చుండ్రు ప్రకాశ్ కేక్ కట్ చేసి దివ్యాంగులకు పంచారు. ఆటలు, పాటల పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ బాలబాలికలకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన 7 ట్రై సైకిళ్లు, 5 వీల్‌చైర్లను లబ్ధిదారులకు అందించారు. దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు మేడపాటి పాపిరెడ్డి, పట్టణ ప్రముఖులు మల్లిపూడి గణేశ్, గుండు తాతరాజు, చక్కా రాంబాబు, కురసాల సత్యనారాయణ, మోరంపూడి సుబ్రహ్మణ్యం, గాలింకి నాగేశ్వరరావు, వీహెచ్‌పీఎస్ సభ్యులు మేడిశెట్టి రాంబాబు, అనసూరి విజయ్, కురుపూడి శ్రీను, బొజ్జా రామకృష్ణ, కాళిదాసు వెంకటలక్ష్మి, శనగల భవాని, దూలి ప్రవీణ్, పూలపల్లి రాజా తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో..

దివ్యాంగుల సమస్యలను సామాజిక కోణంలో పరిశీలించి తగిన న్యాయం చేయాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తి అన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పట్టణంలోని భవిత సెంటర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐఈఆర్టీ అనురాధ, ఉదయ్ శంకర్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ సత్యనారాయణమూర్తి, ఎంఈఓలు రామచంద్రరావు, సోమిరెడ్డి, ఉపాధ్యాయుడు ఎల్.శ్రీనివాస్, గ్రంథాలయాధికారి పూర్ణమ్మ హాజరయ్యారు. భవిత కేంద్రం నిర్వాహకులను అభినందించారు. ప్రతిభా పోటీల్లో విజేతలైన చిన్నారులకు ఫిజియో థెరపిస్టు ప్రియాంక బహుమతులు అందజేశారు. ఫిజియో విశ్వనాథ్ చిన్నారులకు విందు ఏర్పాటు చేశారు.